క్లుప్తంగా

'ప్రజా సంక్షేమమే బీఆర్‌ఎస్ లక్ష్యం'



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే చిన్నయ్య

తాండూర్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పాలనసాగిస్తోందని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. మండలకేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ద్వారకాపూర్, నీలయపల్లె, బోయపల్లి గ్రామపంచాయతీ భవనాల నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బానయ్య, ఎంపీపీ ప్రణయ్‌కుమార్, వైస్ ఎంపీపీ నారాయణ, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు దివ్యాంగుల వినతి

వేమనపల్లి: మండలానికి చెందిన దివ్యాంగులకు గృహలక్ష్మి కింద ఇళ్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యకు మంగళవారం వినతిపత్రం అందజేశారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

వేమనపల్లి: నీల్వాయికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పలువురు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వేణుమాధవ్, మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. చేరిన వారిలో సీనియర్ నాయకుడు పటాన్, అజ్మాయిల్, బీసీ సెల్ నాయకుడు గొల్లగట్టు బాపు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ లింగాగౌడ్, మాజీ కోఆప్షన్ సభ్యుడు హమీద్‌ఖాన్, చెన్నూరి సంతోష్, రాజేష్, సులేమాన్ పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థుల నిరసన

మంచిర్యాలఅర్బన్: హైదరాబాద్‌లో పాఠశాల విద్యాశాఖ కార్యాలయ ముట్టడికి యత్నించిన డీఎస్సీ అభ్యర్థులపై రాష్ట్ర ప్రభుత్వం లాఠీచార్జీ చేయించడాన్ని ఖండిస్తూ మంచిర్యాలలో డీఎస్సీ అభ్యర్థులు మంగళవారం నిరసన తెలిపారు. లాఠీచార్జీలు, అరెస్టులు సరికాదన్నారు. డీఎస్సీ అభ్యర్థులు హరికృష్ణ, సంజీవ్, రాహుల్, మమత, సంధ్య, రాజేశ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు హెచ్‌ఐవీపై క్విజ్



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

మంచిర్యాలటౌన్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో వివిధ పాఠశాలల విద్యార్థులకు జిల్లాస్థాయి క్విజ్ పోటీలను మంగళవారం నిర్వహించారు. ఎయిడ్స్, హెచ్‌ఐవీపై విద్యార్థి దశ నుంచే పూర్తిస్థాయి అవగాహన ఉండాలని, ఇందుకోసం వైద్యారోగ్యశాఖ కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, నాందేవ్, మూర్తి, యోగేశ్వర్ పాల్గొన్నారు.

'బీజేపీని గెలిపించండి'



సమస్యలు తెలుసుకుంటున్న రఘునాథ్

మంచిర్యాలటౌన్: వచ్చే ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే, మంచిర్యాల పట్టణాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. జిల్లా కేంద్రంలోని 27వ వార్డు గౌతమినగర్‌లో మంగళవారం ఇంటింటికీ వెళ్లి, ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, డ్రెయినేజీ, రోడ్ల సమస్యలు ఎక్కువగా ఉన్నా ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని, పట్టణంలో మౌలిక సదుపాయాలను కల్పించడంలో పూర్తిగా విఫలం చెందారని ఆరోపించారు.

నిజామాబాద్‌కు మంచిర్యాల టీపీవో

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారిగా పనిచేస్తున్న సత్యనారాయణను నిజామాబాద్‌కు డిప్యూటేషన్‌పై పంపగా, మంగళవారం నిజామాబాద్‌లో విధుల్లో చేరారు. ప్రస్తుతం మంచిర్యాల టౌన్ ప్లానింగ్ అధికారిగానే కొనసాగినా, పూర్తిస్థాయి విధులను మాత్రం నిజామాబాద్ మున్సిపల్‌లో నిర్వహించనున్నారు. మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలో ఇళ్ల నిర్మాణాలు ఎక్కువ కాగా, పట్టణం వేగంగా అభివృద్ధి చెందుతుంది. టౌన్ ప్లానింగ్ విభాగంలో అత్యంత కీలకమైన పోస్టులో ఉన్న టీపీవోను మరో మున్సిపాలిటీకి డిప్యూటేషన్‌పై పంపించి, ఇక్కడ ఎవరికి విధులను అప్పగించకపోవడంతో, పట్టణ అభివృద్ధి, ఇంటి అనుమతులు సకాలంలో అందడంపై ప్రభావం చూపనుంది.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

- గిడుగు రామ్మూర్తికి నివాళి

దండేపల్లి: తెలుగు భాష దినోత్సవాన్ని దండేపల్లి మండలంలోని లింగాపూర్ ఆదర్శ పాఠశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. వ్యవహారిక భాషోద్యమకర్త గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం శాస్త్రీయ కోణంలో తెలుగుభాష గొప్పదనాన్ని, తెలుగు సాహిత్య ప్రక్రియలను ప్రదర్శనగా ఏర్పాటు చేశారు. అనంతరం నృత్యకార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ అనీలా, తెలుగు ఉపాధ్యాయురాలు సుజాత, ఉపాధ్యాయులు రమేష్, వెంకటేష్, రజనీ, రాజన్న, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

కోటపల్లి: గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకుని బమన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం బుచ్చన్న ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగు వాడుక భాషా ఉద్యమ పితామహుడు గ్రాంథిక భాషలో ఉన్న వచనాన్ని, ప్రజల వాడుక భాషలోకి తీసుకొచ్చిన మహనీయుడని హెచ్‌ఎం బుచ్చన్న తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

'తెలుగుభాషలో ఎంతో మాధుర్యం'

బెల్లంపల్లి: తెలుగు భాషలో ఉన్న మాధుర్యం మరే భాషలో లేదని తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బెల్లంపల్లి బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ(సీఓఈ) కళాశాల ప్రిన్సిపాల్ ఐనాల సైదులు అన్నారు. సీఓఈలో మంగళవారం తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా వ్యవహారిక భాషోద్యమకర్త గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూల మాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం విద్యార్థులు పద్యగానం చేసి అలరించారు. శతకాల్లోని పద్యాలను శ్రావ్యంగా ఆలపించి, అర్థ వివరణ చేసి ఆకట్టుకున్నారు. తెలుగు భాషా దినోత్సాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వ్యాసరచన, పద్యపఠనం, వక్తృత్వ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె.రాజ్‌కుమార్, తెలుగు విభాగం సభ్యులు సజ్జనపు విజయ్, చంద్రశేఖర్, సింగారావు స్రవంతి, జేవీపీ కె.రాజేశ్వర్, ఉపాధ్యాయులు దాసం అజిత, రమాదేవి, హారిక, కౌసర్, ప్రేమలత, రాజ్‌కుమార్, ప్రమోద్‌కుమార్, రామారావు, గణపతి, రమేష్, శ్రీరామవర్మ, రవి, అనిరుద్, విద్యార్థులు పాల్గొన్నారు.



దండేపల్లి: లింగాపూర్‌లో భాషా ప్రక్రియల ప్రదర్శన

మంచిర్యాలటౌన్: పట్టణంలోని కాలేజీరోడ్డులో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఎస్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాసం, పాటల పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డి.సుమతి, వైస్ ప్రిన్సిపాల్ కె.శివలీల, తెలుగు విభాగ అధ్యాపకులు వి.స్వప్న, ఎ.భాగ్యలక్ష్మి, కె.అంజలి పాల్గొన్నారు.



కోటపల్లి: నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం, విద్యార్థులు



బెల్లంపల్లి: శ్రద్ధాంజలి ఘటిస్తున్న ప్రిన్సిపాల్ సైదులు



మంచిర్యాలటౌన్: విజేతలకు బహుమతులు ఇస్తూ..

నియోజకవర్గ అభివృద్ధే ఎజెండా

- ఆదరించండి అభివృద్ధి చేసి చూపిస్తా
- బీఆర్‌ఎస్ నియోజకవర్గ అభ్యర్థి జాన్సన్‌నాయక్



మాట్లాడుతున్న జాన్సన్ నాయక్

జన్నారం: నియోజకవర్గ అభివృద్ధి నా ఎజెండాగా పనిచేస్తానని, ఖానాపూర్ నియోజకవర్గ రూపురేఖలు మారుస్తానని, మీ వద్దకు పాలకుడిగా కాకుండా సేవకుడిగా వచ్చానని ఆదరించి గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని ఖానాపూర్ బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి భుక్య జాన్సన్‌నాయక్ పేర్కొన్నారు. అభ్యర్థి ప్రకటన తర్వాత మొదటిసారిగా జన్నారం మండలానికి వచ్చిన జాన్సన్‌నాయక్‌కు మండల పార్టీ కార్యకర్తలు, నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఇందన్‌పల్లి ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేసిన అనంతరం మండల కేంద్రంలోని పైడిపెల్లి గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి, ఆదిలాబాద్ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, మాజీ డైరీ చైర్మన్ లోక భూమారెడ్డి, మాజీ ఏపీపీఎస్సీ సభ్యుడు రవిందర్‌రావులతో కలిసి హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీపీ సరోజన, జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, కడెం ఎంపీపీ అలెగ్జాండర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గుర్రం రాజరాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి జనార్దన్, నాయకులు ఫజల్‌ఖాన్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భోగ్‌భండార్



భోగ్‌భండార్‌లో పాల్గొన్న నాయకులు, గ్రామస్తులు

భీమారం: మండలంలోని బూర్గుపల్లి గ్రామంలోని సంపత్ సేవాలాల్ ఆలయంలో సోమవారం భోగ్‌భండార్ కార్యక్రమం నిర్వహించారు. లంబాడీలకు ఎంతో ఆరాధ్యదైవమైన సేవాలాల్ మహారాజ్‌కి భోగ్‌భండార్ ద్వారా మొక్కులు తీర్చుకున్నారు. ఈ మేరకు మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్ పూజల అనంతరం మాట్లాడుతూ.. ప్రభుత్వవిప్ బాల్కసుమన్ సేవాలాల్ ఆలయ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేశారని, నిర్మాణ పనులు జరగడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బుక్యారాజు, కులపెద్దలు పాల్గొన్నారు.

పాఠశాలల్లో వృక్ష రక్షాబంధన్

నెన్నెల: మండలంలోని మైలారం జిల్లా పరిషత్ విద్యార్థులు పాఠశాల హెచ్‌ఎం లింగయ్య ఆధ్వర్యంలో మంగళవారం చెట్లకు రాఖీలు కట్టి వృక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. చెట్లకు రాఖీలు కట్టి రక్షగా ఉంటామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.

చెన్నూర్: మానవ మనుగడకు వృక్షాలు ఎంతో దోహద పడుతాయని ఎస్సై శ్వేత అన్నారు. స్థానిక కస్తూర్బా పాఠశాలలో వృక్ష రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై వృక్షాలకు రాఖీలు కట్టారు.

కాసిపేట: చెట్లను మనం కాపాడితే, అవి మనల్ని, ప్రకృతిని కాపాడుతాయని డెప్యూటీ రేంజ్ అధికారి ప్రవీణ్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్, ముత్యంపల్లి పాఠశాలల్లో మంగళవారం విద్యార్థులు చెట్లు నాటి వాటికి రాఖీలు కట్టించారు. విద్యార్థులకు చెట్ల ప్రాముఖ్యత, అడవుల, వన్యప్రాణుల సంరక్షణకు అటవీశాఖ తీసుకుంటున్న చర్యలు వివరించారు.



చెన్నూర్ కస్తూర్బా పాఠశాలలో...

నేరాల నిర్మూలనకే కమ్యూనిటీ కాంటాక్ట్

దండేపల్లి: నేరాల నిర్మూలనకే పోలీస్‌శాఖ కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహిస్తుందని లక్సెట్టిపేట సీఐ కృష్ణ తెలిపారు. దండేపల్లి మండలం ఊట్లలో మంగళవారం సాయంత్రం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. ప్రజల రక్షణ కోసం పోలీస్ శాఖ పనిచేస్తుందని, ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని, అప్పుడే నేరాలను నియంత్రిచ్చవచ్చన్నారు. సైబర్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలన్నారు. పలు అంశాలపై గిరిజన ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో దండేపల్లి ఎస్సై కుందారపు ప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

మంచిర్యాలక్రైం: భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మంగళవారం మంచిర్యాల నియోజకవర్గం పరిధిలోని కాలేజ్ రోడ్ ప్రాంతాల పోలింగ్ బూత్‌లలో ఈవీఎం, వీవీప్యాట్, ద్వారా ఓటు ఎలా వేయాలనే దానిపై జిల్లా ఎన్నికల అధికారి బాధావత్ సంతోష్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సిబ్బంది సీనియర్ అసిస్టెంట్ రాధకృష్ణ, బీఎల్‌ఓలు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. వీవీ ప్యాట్, ఈవీఎంల పనితీరును వివరిస్తూ ఎల్రక్టానిక్ ఓటింగ్ యంత్రంపై అవగాహన కల్పించారు. ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'వ్యక్తిగత సామర్థ్యాల పెంపు కోసమే వాయిస్ ఫర్ గర్ల్స్'

చెన్నూర్: విద్యార్థినులలో వ్యక్తిగత సామర్థ్యాల పెంపునకు వాయిస్ ఫర్ గర్ల్స్ శిబిరం ఉపయోగపడుతుందని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ రాజమణి అన్నారు. స్థానిక తెలంగాణ సాంఘిక సంక్షేమ కళాశాలలో వాయిస్ ఫర్ గర్ల్స్ శిబిరాన్ని ప్రారంభించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

మంచిర్యాలఅర్బన్: స్థానిక హమాలీవాడ శ్రీ భక్తాంజనేయ షిర్డీ సాయిబాబా ఆలయ 11వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు.

ఆశవర్కర్ల నిరసన

బెల్లంపల్లి: సమస్యలు పరిష్కరించాలని గత కొన్ని రోజుల నుంచి ఆందోళనలు చేస్తున్న ఆశవర్కర్లు మంగళవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద నిరసన తెలిపారు.

మందమర్రిరూరల్: ఆశవర్కర్లకు కనీస వేతనం చెల్లించాలని మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే ఆఫీస్ ఎదుట ఆశవర్కర్లు ధర్నా చేపట్టారు.

డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలని వినతి

పాతమంచిర్యాల: ఇళ్లులేని నిరుపేదలకు ఇంటి స్థలం, ఇంటినిర్మాణం కోసం రూ.5లక్షలు ప్రభుత్వం ఇవ్వాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా పార్టీ జిల్లా కార్యదర్శి జాడి దేవరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం సమర్పించారు.

సంక్షిప్త వార్తలు

ముందస్తుగా రాఖీ పండుగ

మంచిర్యాలఅర్బన్: స్థానిక ఆర్‌బీహెచ్‌వీ పాఠశాలలో మంగళవారం ముందస్తు రాఖీ పండుగ నిర్వహించారు. విద్యార్థినులు విద్యార్థులకు రాఖీలు కట్టి తిలకం దిద్ది ఆశీర్వాదం ఇచ్చారు.

డిగ్రీ కళాశాలకు పూర్వ విద్యార్థుల వితరణ

మంచిర్యాలఅర్బన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివిన 1994–97 బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కళాశాలలోని సమస్యలు తెలుసుకుని, నూతనంగా ఏర్పాటు చేసిన సెమినార్ హాల్లో అవసరమైన రూ.30వేల విలువ చేసే సౌండ్ సిస్టం అందజేశారు. పూర్వవిద్యార్థిని రోజీ, ఆమె భర్త సత్యనారాయణ కంప్యూటర్ విరాళం ఇచ్చారు.

ఆకట్టుకున్న పర్యావరణ హిత రాఖీలు

మంచిర్యాలఅర్బన్: పాత మంచిర్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు తయారు చేసిన పర్యావరణ హిత రాఖీలు ఆకట్టుకున్నాయి. కాగితం, దారాలు, పూలు, ధాన్యపు గింజలతో నేలలో సులువుగా కలిసిపోయే పదార్థాలను ఉపయోగించి పర్యావరణ పరిరక్షణ సందేశంతో రాఖీలను తయారు చేశారు.

ఘనంగా ఓనం పండుగ

మంచిర్యాలఅర్బన్: స్థానిక ట్రినిటీ పాఠశాలలో మంగళవారం ఓనం పండుగ నిర్వహించారు. కేరళ మహిళా ఉపాధ్యాయినులు సంప్రదాయ దుస్తులు ధరించి రంగుల ముగ్గులు వేశారు. తీపిపాయసాలు పంచారు. తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా ప్రిన్సిపాల్ జాన్‌థామస్ గిడుగు రామమూర్తి చిత్రపటానికి నివాళులర్పించారు.

'హామీల అమలులో ప్రభుత్వం విఫలం'

బెల్లంపల్లి: గత ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందని బెల్లంపల్లి పట్టణ టీడీపీ సీనియర్ నాయకుడు అమానుల్లాఖాన్ విమర్శించారు. ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బెల్లంపల్లి ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు.

నస్పూర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందని చెన్నూర్ నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సంజయ్‌కుమార్ తెలిపారు. ఐడీఓసీలో పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మంగళవారం ఆయన కలెక్టర్ బాదావత్ సంతోష్‌కు సమర్పించారు.

ఏరియర్స్ చెల్లించాలని ధర్నా

నస్పూర్: 11వ వేజ్ బోర్డుకు సంబంధించిన 23నెలల ఏరియర్స్‌ను ఆగస్టు నెల జీతంతో కలిపి సెప్టెంబర్‌లో చెల్లించాలని సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ (బీఎంఎస్) శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు పెండ్లి మోహన్ రెడ్డి, కార్యదర్శి నాతాడి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. బీఎంఎస్ ఆధ్వర్యంలో మంగళవారం జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జీఎం కార్యాలయంలో డీజీఎం పర్సనల్ అరవిందరావుకు మెమోరాండం సమర్పించారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

నస్పూర్: సింగరేణి సంస్థలో ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని డైరెక్టర్లు ఎన్‌వికే శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రెడ్డి, సుభాని తెలిపారు. డైరెక్టర్లు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో మంగళవారం శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి పాల్గొన్నారు. డైరెక్టర్లు మాట్లాడుతూ.. గత ఆరు సంవత్సరాలుగా ఏరియాలో జరిగిన ప్రమాదాలపై సమీక్షించారు.

బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

దండేపల్లి/లక్సెట్టిపేట: మంచిర్యాల నియోజకవర్గ ఎమ్మెల్యే టికెట్ అన్నీ పార్టీల వారు బీసీలకే ఇవ్వాలని బీసీ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. బీసీ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం మంచిర్యాల నుంచి బైక్ ర్యాలీ చేపట్టగా దండేపల్లి, లక్సెట్టిపేట మండలాల్లోని పలు గ్రామాల్లో కొనసాగింది. రాబోయే ఎన్నికల్లో బీసీల ఐక్యత చాటాలని పిలుపునిచ్చారు. బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



దండేపల్లిలో బీసీ సంఘాల బైక్ ర్యాలీ

తడి, పొడిచెత్త వేరు చేయాలి

- డీపీవో వెంకటేశ్వర్‌రావు

జన్నారం: డంపింగ్‌యార్డుకు తీసుకొచ్చిన తడి, పొడిచెత్త వేరు చేయాలని డీపీవో వెంకటేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని తిమ్మాపూర్, రాంపూర్, చింతగూడ, తపాలపూర్ గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. పల్లెప్రకృతి వనాలు, డంపింగ్‌యార్డులు, శ్మశాన వాటికలను పరిశీలించారు. పారిశుధ్యంపై దృష్టి సారించాలని, డ్రెయినేజీల నిర్వహణ ఎప్పటికప్పుడు చూడాలన్నారు. తడిచెత్తను వేరు చేసి కంపోస్టు ఎరువుల తయారీకి వినియోగించుకోవాలని సూచించారు. పారిశుధ్యం విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట ఎంపీవో రమేశ్, సర్పంచ్ గంగాధర్, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.



తిమ్మాపూర్‌లో పల్లెప్రకృతి వనం పరిశీలిస్తున్న డీపీవో

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

చెన్నూర్: క్రీడాకారులకు చెన్నూర్ పెట్టింది పేరని, రానున్న రోజుల్లో చెన్నూర్ క్రీడాకారులు అంతర్జాతీయ క్రీడల్లో మెరువాలని చెన్నూర్ రూరల్ సీఐ విద్యాసాగర్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో అంతర్జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

దండేపల్లి: జాతీయ క్రీడా వేడుకలను మండలంలోని ద్వారక ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

లక్సెట్టిపేట: జాతీయ క్రీడా దినోత్సవాన్ని శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో నిర్వహించారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లా కేంద్రంలోని పరేడ్ మైదానంలో మంగళవారం ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేడుకల్లో జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి శ్రీకాంత్‌రెడ్డి, టీజీ పీఈటీ సంఘం జిల్లా అధ్యక్షుడు సిరంగి గోపాల్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, క్రికెట్ కోచ్ ప్రదీప్, ఫిట్‌నెస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



చెన్నూర్: క్రీడా ర్యాలీని ప్రారంభిస్తున్న సీఐ

మహిళల భద్రత-పోలీసుల బాధ్యత

దండేపల్లి/నెన్నెల/చెన్నూర్/లక్సెట్టిపేట/జన్నారం/నస్పూర్/కాసిపేట/భీమిని/తాండూర్/మందమర్రిరూరల్: పోలీసుల ఆధ్వర్యంలో 'మహిళ భద్రత-పోలీసుల బాధ్యత' కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. దండేపల్లిలోని లింగాపూర్ ఆదర్శ పాఠశాలలో ఎస్సై కుందారపు ప్రసాద్, నెన్నెలలోని కస్తూరిబా పాఠశాలలో ఎస్సై శ్యాంపటేల్, చెన్నూర్ కస్తూర్బా కళాశాలలో చెన్నూర్‌రూరల్ సీఐ విద్యాసాగర్, లక్సెట్టిపేట ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో సీఐ కృష్ణ, జన్నారం రేండ్లగూడ ప్రభుత్వ పాఠశాలలో జన్నారం రెండో ఎస్సై సర్కార్, నస్పూర్‌లో శ్రీరాంపూర్ సీఐ రమేశ్‌బాబు కేరళ ఇంగ్లిష్ మీడియం మోడల్ స్కూల్లో, కాసిపేటలోని ధర్మరావుపేట జిల్లా పరిషత్ హైస్కూల్లో దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు, కన్నెపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో ఎస్సై నరేష్, మందమర్రి కార్మెల్ హైస్కూల్‌లో సీఐ మహేందర్‌రెడ్డి, తాండూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీఐ శ్రీనివాస్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు పోలీసులకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

దళితులందరికీ 'దళితబంధు' అమలుచేయాలి

- ఆర్‌కేపీలో బీజేపీ నిరసన దీక్ష
- అనుమతి లేదంటూ దీక్షను అడ్డుకున్న పోలీసులు



నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

రామకృష్ణాపూర్: దళితులందరికీ దళితబంధు పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో పట్టణంలోని అంగడిబజార్ అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం నిరసన దీక్ష చేపట్టారు. బీజేపీ ఎస్సీ మోర్చ ఆధ్వర్యంలో తలపెట్టిన ఈ నిరసన కార్యక్రమానికి, ఎలాంటి అనుమతులు లేవంటూ పోలీసులు దీక్షను అడ్డుకుని పలువురు నాయకులను అరెస్టు చేశారు. దీంతో అంబేద్కర్ విగ్రహం నుంచి పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీ చేపట్టి, నిరసన తెలిపారు. పోలీసుల తీరుపై నాయకులు అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చ జిల్లా అధ్యక్షుడు పత్తి శ్రీనివాస్ , నాయకులు మాస్ సత్యనారాయణ, ధన్‌సింగ్, ముద్దసాని శ్రీనివాస్, జంగపెల్లి మల్లయ్య, పాల రాజయ్య, వైద్య శ్రీనివాస్, వెంకటేష్, సంతోష్‌రామ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన

నెన్నెల: విజ్ఞానానికి విద్యార్థులు సైన్స్ తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా స్థాయి జిజ్ఞాస సంచార ప్రయోగశాల నిర్వాహకులు సాయికుమార్, సంపత్ అన్నారు. మైలారం జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో డీఈఓ యాదయ్య ఆదేశాల మేరకు జిల్లా సైన్స్ అధికారి మధుబాబు పర్యవేక్షణలో విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన కల్పించారు. మానవ శరీరం, అంతర్గత అవయవాల పనితీరు, ప్రయోగపరికరాల పని విధానం గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లింగయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ప్రయోగశాల నిర్వాహకులు

మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యం

- వైద్యాధికారి డాక్టర్ సుబ్బారాయుడు

జైపూర్: మహిళల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ప్రభుత్వం ప్రత్యేక ఆరోగ్య మహిళా కార్యక్రమం ద్వారా ప్రతీ మంగళవారం ప్రత్యేక శిబిరాలు నిర్వహించి అన్నిరకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తోందని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుబ్బారాయుడు తెలిపారు. జైపూర్ మండలం కుందారం ఆస్పత్రిలో మంగళవారం ఆరోగ్య మహిళ క్యాంపును సందర్శించారు. మహిళలకు అందిస్తున్న వైద్య సేవలు, రికార్డులను పరిశీలించారు. స్త్రీ వైద్యనిపుణురాలు డాక్టర్ అరుణశ్రీ స్త్రీల ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య మహిళా క్యాంపు ద్వారా అందిస్తున్న వైద్యసేవలను వివరించారు. అనంతరం ప్రభుత్వం ద్వారా వచ్చిన శానిటరీ న్యాప్కిన్స్‌ను మహిళలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి శ్రావ్య, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న సుబ్బారాయుడు

కార్యవర్గం ఎన్నిక

పాతమంచిర్యాల: పట్టణ నాయీబ్రాహ్మణ సేవా సంఘం కార్యవర్గం ఎన్నికలు జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడిగా ఆదిమూలం శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కంది సత్యం, ప్రధాన కార్యదర్శిగా కంది కిరణ్, కోశాధికారిగా రాచకొండ శంకర్‌ను ఎన్నుకున్నారు.